క్లుప్తంగా

ఆలయ పునర్నిర్మాణానికి రూ.25వేలు విరాళం



విరాళం అందిస్తున్న శ్రీనివాసరావు

ఖమ్మంఅర్బన్: నగరంలోని 4వ డివిజన్ కైకొండాయిగూడెం క్రాస్‌రోడ్డులోని శ్రీఅంకమ్మ, శ్రీమహాలక్ష్మమ్మ, శ్రీమద్దిరావమ్మ దేవాలయ పునర్నిర్మాణానికి దాతలు విరాళం అందించారు. శుక్రవారం ప్రశాంతినగర్‌కు చెందిన కాసర్ల శ్రీనివాసరావు, వాణి దంపతులు రూ. 25,116లను దేవాలయ కమిటీ బాధ్యులకు అందించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఖమ్మంవ్యవసాయం: ఖమ్మం విద్యుత్ విభాగం టౌన్–1 గాంధీచౌక్ 33/11 కేవీ సబ్ స్టేషన్ మరమ్మతుల దృష్ట్యా శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సబ్ స్టేషన్ పరిధిలోని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ మౌల్విక శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈమేరకు ఎమ్మార్వో ఆఫీస్, సాయిరాం థియేటర్ రోడ్, మోతీనగర్, బొక్కలగడ్డ, పంపింగ్ వెల్ రోడ్, ఫిల్టర్‌బెడ్ రోడ్, ఆటోస్టాండ్, పెద్దమ్మ తల్లి గుడి, గాంధీచౌక్, పీఎస్ఆర్ రోడ్, సుందర్ టాకీస్ రోడ్, కన్యకా పరమేశ్వరీ గుడి లైన్, జహీర్‌పుర తండా, వెంకటలక్ష్మి టాకీస్ రోడ్, గాంధీనగర్, కొత్త సీతారాములు రోడ్, జహీర్‌పుర, బోసు బొమ్మ సెంటర్, సుందరయ్యనగర్, పత్తి మార్కెట్ రోడ్, మార్కెట్ రోడ్, మంచికంటి నగర్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ కోత ఉంటుందని ఏఈ తెలిపారు.

విద్యార్థులకు మధ్యాహ్న భోజనం బంద్

కూసుమంచి: మధ్యాహ్న భోజన కార్మికులు తమ పెండింగ్ వేతనాలు విడుదల చేయాలని, అప్పటి వరకు భోజనాలు వండలేమని విధులకు రాకపోవటంతో విద్యార్థులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. దీనిలో భాగంగా శుక్రవారం మండలంలోని గైగోళ్లపల్లి, సంధ్యాతండా, ఉడుతలగూడెం పాఠశాలల్లో మధ్యాహ్న భోజన కార్మికులు విధులకు హాజరు కాకపోవడంతో ఆయా పాఠశాలల విద్యార్థులు ఇళ్లకు వెళ్లి భోజనాలు చేయాల్సి వచ్చింది. ఈనేపథ్యాన ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తామని విద్యాశాఖ అధికారులు చెపుతున్నారు.

గుడుంబా రహిత సమాజమే లక్ష్యం



మాట్లాడుతున్న పోశెట్టి

నేలకొండపల్లి: జిల్లాలోనే నేలకొండపల్లి ఎక్సైజ్ సర్కిల్‌ను గంజాయి, గుడుంబా రహిత సర్కిల్‌గా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటానని నేలకొండపల్లి ఎక్సైజ్ సీఐ కె.పోశెట్టి పేర్కొన్నారు. నేలకొండపల్లి సీఐగా పని చేసిన విజేందర్ ఖమ్మంకు బదిలీ కాగా ఖమ్మంలో పని చేస్తు న్న పోశెట్టి నేలకొండపల్లికి బదిలీ అయ్యారు. ఈమేరకు శుక్రవారం సీఐగా బాధ్యతలు స్వీకరించాక సర్కిల్ సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించి విలేకరులతో మాట్లాడారు. అనంతరం సీఐను ఎక్సైజ్ ఎస్సై శంకర్, సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు.

సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ల వద్ద గంజాయి స్వాధీనం?

ఖమ్మంరూరల్: మండలంలోని వరంగల్ క్రాస్ రోడ్డులో ఇద్దరు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ల నుంచి రెండు కేజీల గంజాయిని శుక్రవారం అర్ధరాత్రి రూరల్ పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. ఖమ్మంకు చెందిన వీరు గంజాయిని ద్విచక్రవాహనంపై తరలిస్తుండగా పోలీసులు పోలీస్‌స్టేషన్‌కు సమీపంలోనే స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం.

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	106	బచ్చలికూర	4
వంకాయ	26		10
బెండకాయ	30	పాలకూర	3
పచ్చిమిర్చి	96		10
కాకర	60	చుక్కకూర	3
సొరకాయ	20		10
బీర	46	తోటకూర	4
దొండ	20		10
పొట్లకాయ	60	గోంగూర	2
చిక్కుడు	50		10
గోరుచిక్కుడు	40	మెంతికూర	4
క్యాబేజీ	24		20
క్యాలీఫ్లవర్	50	కొత్తిమీర	1
ఆలుగడ్డ	24		30
చామగడ్డ	40	పుదీన	1
క్యారెట్	46		20
క్యాప్సికం	80	–ఖమ్మం వ్యవసాయం	



కూసుమంచిలో సంత రోజు ఖమ్మం–సూర్యాపేట రహదారిపై వాహనదారుల ఇక్కట్లు

సంత.. చింత..

వారాంతపు సంతలకు పోటెత్తుతున్న జనం

- రహదారి వెంటే సంతల నిర్వహణ
- ట్రాఫిక్‌తో ఇబ్బంది పడుతున్న వాహనదారులు
- కనీస సౌకర్యాలు కరువు
- ప్రత్యేక స్థలం లేక ఇక్కట్లు
- పట్టించుకోని పాలకులు



కూసుమంచి సంతలో జనం రద్దీ

కూసుమంచి: మండలంలో పాలేరు, కూసుమంచి, నాయకన్‌గూడెం వారాంతపు సంతల రోజు ట్రాఫిక్‌తో జనం ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఈ సంతల నిర్వహణకు ప్రత్యేక స్థలాన్ని కేటాయిస్తే ట్రాఫిక్ సమస్యలు తొలగడంతో పాటుకొనుగోలుదారులకు సౌఖ్యంగా ఉంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. సంతల వలన గ్రామ పంచాయతీలకు ఆదాయం సమకూరుతున్నా .. కనీస సౌకర్యాలను కల్పించడంలో పాలకులు విఫలం చెందారనే చెప్పాలి.

శుక్రవారం పాలేరులో..

పాలేరులో ప్రతీ శుక్రవారం జరిగే సంతలో ముఖ్యంగా పశువుల, మేకల క్రయవిక్రయాలతో పాటు కూరగాయలు, ఇతర వస్తువుల విక్రయాలు ఎక్కువగా జరుగుతుంటాయి. పశువులు, మేకల విక్రయాలకు ప్రత్యేక స్థలం ఉంది కానీ కూరగాయలు, ఇతర వస్తువుల విక్రయాలకు ప్రత్యేక స్థలం లేదు. కూరగాయల వ్యాపారులు బొడ్రాయి బజారులో వ్యాపారాలు నిర్వహించడంతో సంత రోజు ఈ బజారులో వాహనాల రాకపోకలు బంద్ కావల్సిందే. కొందరు తోపుడుబండ్లు, ఇతర వ్యాపారులు రోడ్డు వారీగా ఉంచి విక్రయాలు చేస్తుండడంతో ట్రాఫిక్ సమస్య నెలకొంటుంది.

బుధవారం నాయకన్‌గూడెంలో..

మండలంలోని నాయకన్‌గూడెంలో ప్రతి బుధవారం నిర్వహించే సంతను రాజుపేట రోడ్‌లో నిర్వహిస్తున్నారు. ఈ సంత రోజున నాయకన్‌గూడెం, చుట్టుపక్కల గ్రామాల ప్రజలతో పాటు సమీప సూర్యాపేట జిల్లాలోని పలు గ్రామాలకు చెందిన ప్రజలు వస్తుంటారు. దీంతో రద్దీ పెరిగా ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది. సాయంత్రం వేళ ట్రాఫిక్‌కు తీవ్ర ఇబ్బంది పడాల్సిందే. ఈ సంతలకు ప్రత్యేక స్థలాలను కేటాయిస్తే క్రయ, విక్రయదారులకు ఇబ్బందులు తొలగడంతో పాటు ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా తీరుతాయాని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

సోమవారం కూసుమంచిలో..

మండల కేంద్రం కూసుమంచిలో ప్రతీ సోమవారం నిర్వహించే కూరగాయల సంత ఎక్కువ ప్రాధాన్యతను సంతరించుకుంది. ఈసంతకు కూసుమంచితో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి వందల సంఖ్యలో కొనుగోలుదారులు వస్తుంటారు. వారిలో చాలా మంది ద్విచక్ర వాహనాలు, ఆటోల్లో వస్తుండడంతో వారు తమ వాహనాలను నిలిపేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ఈ సంతలో వ్యాపారులు పోచారం వెళ్లే రహదారి వెంట విక్రయాలు సాగిస్తున్నందున సంత రోజు ఆ రహదారిలో వచ్చిపోయే వాహనాలకు తీవ్ర ఇబ్బంది కలుగుతోంది. వాహనాలు కూసుమంచి గ్రామంలోకి వెళ్లాలన్నా, కిష్టాపురం, పోచారం గ్రామాలకు రాకపోకలు సాగించాలన్నా కష్టతరమే. పాఠశాలల బస్సులు, ట్రాక్టర్లు, లారీలు ఈదారిలో వెళ్లాల్సి ఉన్నందున అష్టకష్టాల నడుమ వారు జనాన్ని దాటుకుంటూ ముందుకు వెళ్తున్నారు. ఎదురెదురుగా వాహనాలు వస్తే ఇక ట్రాఫిక్‌కు అంతరాయమే. దీంతో పాటు సంతలో సంత వ్యాపారులు రోజు వారీగా విక్రయాలు చేస్తుండడంతో పక్కనే ఉన్న ఇతర దుకాణాలకు వచ్చిపోయే వారికి, దుకాణదారులకు తీవ్ర అసౌకర్యం కలుగుతోంది. ముఖ్యంగా సంతకు వచ్చిపోయేవారు ఖమ్మం–సూర్యాపేట రాష్ట్రీయ రహదారిని దాటి రావాల్సి ఉన్నందున రహదారిపై వచ్చే వాహనాలతో ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయి.

రాకపోకలకు ఇబ్బంది..



సంత రోజు కూసుమంచి హైస్కూల్ నుంచి పోచారం వెళ్లే దారిలో రద్దీగా ఉంటుంది. వాహనాలు వచ్చిపోయేందుకు తీవ్ర ఇబ్బంది ఏర్పడుతుంది. ఇక ట్రాక్టర్లు, భారీ వాహనాలు వెళ్లే పరిస్థితి ఉండదు. ఎదురుగా వాహనాలు వచ్చినప్పుడు ఇరుకు రహదారిలో కష్టంగా ఉంటుంది.

– గొల్లపూడి నవీన్, కూసుమంచి

అసౌకర్యంగా ఉంటోంది..



కూసుమంచిలో సంత రోజున మా దుకాణాల ముందే వ్యాపారులు కూర్చొని కూరగాయలు అమ్ముతుంటారు. సంతకు వచ్చే వాళ్లు, వాహనాల రాకపోకలతో రోడ్డు రద్దీగా ఉంటుంది. మా దుకాణాలకు వచ్చే వారికి దారి మూసుకపోయి అసౌకర్యం ఉంటోంది. ఈ సమస్యను తొలగించాలి.

– యాకుబ్, ఆటోమొబైల్స్ దుకాణం

బ్రిడ్జిలు నిర్మించాలని ఎమ్మెల్యేకు వినతి



వినతి పత్రం అందజేస్తున్న బచ్చోడు గ్రామస్తులు

తిరుమలాయపాలెం: మండలంలోని బచ్చోడు పరిధిలోని పెద్దచెరువు, రెడ్డికుంట చెరువు అలుగుల వద్ద బ్రిడ్జి నిర్మాణాలు చేపట్టాలని, బచ్చోడుని మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని కోరుతూ బచ్చోడు గ్రామస్తులు శుక్రవారం కూసుమంచి క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా గైగోళ్లపల్లి వరకు బీటీ రోడ్డు ఏర్పాటు చేయాలని కోరగా.. స్పందించిన ఎమ్మెల్యే సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పలు పార్టీ నాయకులు తిమ్మడి హన్మంతరావు, గొర్రెపాటి లింగయ్య, సతీష్, లచ్చయ్య, భిక్షం తదితరులు పాల్గొన్నారు.

సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహ ఏర్పాటుకు రూ.లక్ష విరాళం..

మండలంలోని ఎదుళ్లచెరువు గ్రామంలో గౌడ కులస్తులు సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తుండడంతో పాలేరు ఎమ్మెల్యే కందాల ఉపేందర్ రెడ్డి శుక్రవారం రూ.లక్ష విరాళాన్ని అందజేశారు. ఈ సందర్భంగా గౌడ కులస్తులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంపాటి శ్రీనివాసరావు, దర్గయ్య, వెంకటేశ్వర్లు, సొంటి రాములు, చామకూరి సాయి తదితరులు పాల్గొన్నారు.

పార్టీ బీమా చెక్కులు అందజేత..

నేలకొండపల్లి: మండలంలోని ఇటీవల మృతి చెందిన పార్టీ కార్యకర్తల కుటుంబాలకు మంజూరైన పార్టీ బీమా చెక్కులను క్యాంపు కార్యాలయంలో శుక్రవారం పాలేరు శాసనసభ్యుడు కందాల ఉపేందర్‌రెడ్డి పంపిణీ చేశారు. అనాసాగారం గ్రామానికి చెందిన రమేష్, కొత్తకొత్తూరు గ్రామంలో సూర్య ఇటీవల మృతి చెందారు. బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వం ఉన్నందున్న కుటుంబ సభ్యులకు రూ.2 లక్షల చొప్పున కుటుంబసభ్యులకు చెక్కులను అందించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు పలువురు పాల్గొన్నారు.

రైల్వే లైన్‌ను అడ్డుకుంటాం..

ఖమ్మం రూరల్: డోర్నకల్–మిర్యాలగూడ రైల్వే లైన్‌ను ఖమ్మం రూరల్ మండలం నుంచి వెళ్లకుండా అడ్డుకుంటామని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బండి రమేష్ అన్నారు. మండలంలోని ఎం.వెంకటాయపాలెంలో సీపీఎం జోన్ కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఇప్పటికే మండలంలో మూడు వైపుల నుంచి హైవే రోడ్ల క్రింద వందల ఎకరాల భూములు కోల్పోయారని, మళ్లీ రైల్వే లైన్ పేరు చెప్పి రైతులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు జీవనాధారంగా ఉండే ఈ భూములు కోల్పోతే రైతు కుటుంబాలు రోడ్డున పడతాయని అన్నారు. రైతుల పక్షాన నిలబడి పార్టీ ఆధ్వర్యాన మండల వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి నండ్ర ప్రసాద్ నాయకులు పుచ్చకాయల నాగేశ్వరరావు, వెంకట్రామయ్య, నాగేశ్వరరావు, వెంకటరమణ, సంజీవరెడ్డి, నాగేశ్వరరావు, నాగేశ్వరరావు, చంద్రయ్య, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

సన్మానం..



ప్రసాద్‌ను సన్మానిస్తున్న సంఘం బాధ్యులు

ఖమ్మంమయూరిసెంటర్: ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నియమితులైన పులిపాటి ప్రసాద్‌ను శుక్రవారం పలువురు సన్మానించా రు. ఈసందర్భంగా ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. ఉమ్మడి జిల్లాలో సంఘం పటిష్టకు ప్ర సాద్ విశేష కృషి చేస్తున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కోశాధికారి మల్లికార్జునగుప్తా, మహిళా అధ్యక్షురాలు ఉప్పల శారద, జిల్లా అధ్యక్షుడు వనమా వేణుగోపాలరావుతోపాటు వనమా విశ్వేశ్వరరావు, గోళ్ల రాధాకృష్ణ, గుమ్మడివెల్లి శ్రీనివాస్, ఉప్పు నరేష్, దేవకి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రూ.1.40 కోట్లతో హైమాస్ట్ వెలుగులు



పనులను పరిశీలిస్తున్న సుడా చైర్మన్, తదితరులు

రఘునాథపాలెం: మండలంలోని 35 గ్రామాల్లో స్తంభాద్రి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఖమ్మం (సుడా) నిధులు రూ.1.40 కోట్లతో హైమాస్ట్ వెలుగులు అందించబోతున్నట్లు సుడా చైర్మన్ బచ్చు విజయ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం మండలంలో గ్రామాల్లో కూడళ్లలో ఏర్పాటు చేస్తున్న హైమాస్ట్ లైట్లు అమర్చే పనులను చైర్మన్, డైరెక్టర్ అజ్మీరావీరు నాయక్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ మంత్రి పువ్వాడ చొరవతో పనులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కాగా, ఈ పనులను పంచాయతీరాజ్ అధికారులతో కలిసి మండలంలోని జింకలతండా, పరికలబొడుతండా గ్రామాల్లో పర్యటించి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మోతి లాల్, రామా,ఆత్మ డైరెక్టర్ చందర్, పంచాయతీరాజ్ అధికారులు ఏఈ ఆదిత్య రాజ్, మంగు, బుజ్జి, కరీం, రామారావు, తదితరులు పాల్గొన్నారు.

ఇన్ఫోసిస్‌ను సందర్శించిన ఎస్‌బీఐటీ విద్యార్థులు

ఖమ్మంసహకారనగర్: హైదరాబాద్‌లోని ఇన్ఫోసిస్ క్యాంపస్‌ను తమ విద్యార్థులు టాస్క్ ఆధ్వర్యాన ఇండస్ట్రీయల్ విజిట్‌లో భాగంగా శుక్రవారం సందర్శించినట్లు ఎస్‌బీఐటీ కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ తెలిపారు. ఇన్ఫోసిస్ కంపెనీ సీనియర్ ప్రిన్సిపల్ కన్సల్టెంట్ పీఎస్ నివాస్ పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారని పేర్కొన్నారు. అనంతరం ఇన్ఫోసిస్ వైస్ ప్రెసిడెంట్ మనీషాసాబు డ్రీమ్ టూ రియాలిటీ అనే అంశంపై విద్యార్థులకు వర్క్‌షాపు నిర్వహించి అవగాహన కల్పించారన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ జి.ధాత్రి, ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్‌లు విద్యార్థులను అభినందించారు.

అంబేడ్కర్ విగ్రహానికి వినతి



వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ శ్రేణులు

ఖమ్మం మామిళ్లగూడెం: బీఆర్ఎస్ ప్రభుత్వం తొమ్మిదేళ్లపాలనలో దళితులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షుడు కోటమర్తి సుదర్శన్ ఆధ్వర్యాన శుక్రవారం జెడ్పీసెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ, బీజేపీ తమిళనాడు రాష్ట్ర సహ ఇన్‌చార్జ్ పొంగులేటి సుధాకర్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ మాట్లాడుతూ.. దళితులను మోసపూరిత పథకాలతో మభ్యపెడుతూ కాలయాపన చేస్తున్న బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని గద్దె దింపాలన్నారు. దళితులకు మూడెకరాల భూమి, దళితబంధు, అర్హులైనవారికి డబుల్ బెడ్‌రూం, డప్పులు కొట్టేవారికి రూ.5వేలు పింఛన్, నిరుద్యోగ భృతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు గెంటెల విద్యాసాగర్, జిల్లా ప్రధాన కార్యదర్శులు నున్నా రవికుమార్, శ్యామ్ రాథోడ్, మంద సరస్వతి, గుత్తా వెంకటేశ్వర్లు, కొలిపాక శ్రీదేవి, ఖమ్మం అసెంబ్లీ కన్వీనర్ అల్లిక అంజయ్య, ఎస్సీ మోర్చా జిల్లా టీం మాదుగుల చిన్ని, కృష్ణయ్య, బండ్ల రీగన్ ప్రతాప్, ఉపేందర్, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

'రాయల' పరామర్శ

నేలకొండపల్లి: మండలంలోని కొరట్లగూడెంలో అనారోగ్యంతో చికిత్స పొందుతున్న బచ్చలకూరి అంద్రబాబును శుక్రవారం టీపీసీసీ సభ్యుడు రాయల నాగేశ్వరరావు పరామర్శించారు. ఆయన వెంట పార్టీ డివిజన్ నాయకుడు మంకెన వాసు, కాంగ్రెస్ పాలేరు సేవా దళ్ కన్వీనర్ బచ్చలకూరి నాగరాజుతో పాటు జెర్రిపోతుల అంజిని, గుగులోత్ మోహన్, యడవల్లి నాగరాజు పాల్గొన్నారు.

మన ఆరోగ్యం మన చేతుల్లోనే..

డ్రై డే పనులను పరిశీలించిన కలెక్టర్ గౌతమ్



డ్రెయినేజీల శుభ్రతపై సూచనలు చేస్తున్న కలెక్టర్

ఖమ్మంఅర్బన్: ఎవరికి వారు వ్యక్తిగతంగానే కాకుండా పరిశుభ్రత పాటిస్తే వ్యాధులు దరిచేరవని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ పేర్కొన్నారు. 'డ్రైడే'ను పురస్కరించుకుని శుక్రవారం నగరం ఖానాపురం హవేలీలో పర్యటించిన ఆయన పారిశుద్ధ్య పనులను తనిఖీ చేశారు. సైడ్ డ్రెయినేజీలను శుభ్రం చేయించడమే కాక నీటి తొట్టిలు, కూలర్లలో ఉన్న నీటిని పారబోయించారు. డెంగీ దోమల విషయంలో జాగ్రత్తగా ఉండాలని, డెంగీ వస్తే శారీరకంగా, ఆర్థికంగా నష్టం జరుగుతుందని తెలిపారు. ఈవిషయమై పలువురు స్థానికులకు అవగాహన కల్పించారు. అలాగే, డెంగీ పాజిటివ్ వచ్చిన వారి ఇంట్లోని అందరితో పాటు చుట్టుపక్కల వారికి పరీక్షలు చేయాలని ఆరోగ్య సిబ్బందికి సూచించారు. డీఎంహెచ్ఓ బి. మాలతి, జిల్లా మలేరియా అధికారి లక్ష్మీనారాయణ, మంచుకొండ పీహెచ్‌సీ వైద్యులు సంధ్యారాణి, కేఎంసీ అసిస్టెంట్ కమిషనర్ మల్లీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనులను పరిశీలించిన మేయర్

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలోని పారిశుద్ధ్య పనులను మేయర్ పునుకొల్లు నీరజ శుక్రవారం పరిశీలించారు. 44వ డివిజన్, 26వ డివిజన్‌లలో పర్యటించిన మేయర్ అక్కడ జరుగుతున్న పనులను ఆకస్మికంగా తనిఖీ చేసి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రతి మంగళ, శుక్రవారాల్లో తప్పనిసరిగా డ్రైడే నిర్వహించాలని, సిబ్బంది, కార్మికులు ప్రజల్లో అవగాహన తీసుకురావాలని సూచించారు. పారిశుద్ధ్య కార్మికులకు అసరమైన కిట్లు ఎవరికైనా రాకుంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. అలాగే 23వ డివిజన్‌లో స్థానిక కార్పొరేటర్ షేక్ మక్బూల్ ఇంటింటికి తిరిగి డ్రైడేపై ప్రజల్లో అవగాహన కల్పించారు. నిల్వ ఉన్న నీటిని పారబోయించారు.

రానున్నది కాంగ్రెస్ ప్రభుత్వమే..



సమావేశంలో మాట్లాడుతున్న బొందయ్య

నేలకొండపల్లి: వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో రానున్నది కాంగ్రెస్ ప్రభుత్వమేనని, కాంగ్రెస్ ద్వారానే అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందని జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ చైర్మన్, ఎంపీటీసీ బొడ్డు బొందయ్య పిలుపునిచ్చారు. శుక్రవారం మండల పార్టీ కార్యాలయంలో నిర్వహించిన మండల సెల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీని అధికారంలోకి తీసుకొచ్చేందుకు ఎస్సీ సెల్ కార్యకర్తలు శక్తి వంచన లేకుండా కృషి చేయాలన్నారు. ప్రతీ గ్రామంలో గ్రామ కమిటీలు ఏర్పాటు చేసి ప్రభుత్వ వైఫల్యాలను ఇంటింటికి చేరవేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మండల చైర్మన్ జిల్లపల్లి నాగేశ్వరరావు అధ్యక్షత నిర్వహించిన ఈ సమావేశంలో నాయకులు కుక్కల హనుమంతరావు, యం.నాగేశ్వరరావు, శ్రీను, కుటుంబరావు, ప్రవీణ్, లక్ష్మణ్‌రావు, గణేష్, కొడిరెక్కల వినోద్ తదితరులు పాల్గొన్నారు.

యూనిఫామ్ సివిల్ కోడ్ సమంజసం కాదు



మాట్లాడుతున్న జలిసాసుల్తానా యాసిన్

ఖమ్మం మామిళ్లగూడెం: విభిన్న సంస్కృతులు, సంప్రదాయాలు, ఆచారాలు కలిగిన భారతదేశంలో యూనిఫామ్ సివిల్ కోడ్ అమలు చేయడం సమంజసం కాదని ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లాబోర్డు మహిళా విభాగం కన్వీనర్ అడ్వకేట్ జలిసాసుల్తానా యాసిన్ అన్నారు. శుక్రవారం ఖమ్మం భక్తరామదాసు కళాక్షేత్రంలో జమాతే ఇస్లామీ హింద్ జాతీయ మాజీ సహాయ కార్యదర్శి నాసిరా ఖానమ్ అధ్యక్షతన జరిగిన బహిరంగ సభలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఒకే దేశం, ఒకే చట్టం అనే నినాదంతో షరియత్ విధానాలను మార్చడం ఏకత్వంలో భిన్నత్వానికి అర్థం లేదన్నారు. ఈ సభలో ఖమ్మం అర్బన్ అధ్యక్షురాలు రమీమున్నీసా, వాహెదా, ఫాతిమా ఖానమ్, అమీనా, ఆయెషాజబీన్, అతహర్, సుల్తానా, అఫ్‌రోజ్, అన్జుమ్, నస్రీన్, హజిరా, సీమ, ఎస్ఐఓ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

సంతాపం..

ఖమ్మం మామిళ్లగూడెం: ఖమ్మం జిల్లా యాదవ సంఘం మాజీ అధ్యక్షుడు, మాజీ కౌన్సిలర్ మేకల పుల్లయ్య యాదవ్ సతీమణి, మహిళా సంఘం నాయకురాలు మేకల ధనమ్మ అనారోగ్యంతో మృతి చెందారు. ఈమేరకు యాదవ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు జ్వాలా నర్సింహారావు ఆమె భౌతిక కాయంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన వెంట యాదవ సంఘం అధ్యక్షుడు శతకోటి సత్యనారాయణ, శ్రీను, ముతనబాయిన రవి, తోడేటి లింగరాజు, రమేష్ తదితరులు సంతాపం తెలిపారు.

గోశాల సందర్శన



గోపూజ నిర్వహిస్తున్న ప్రతినిధుల బృందం

ఖమ్మంఅర్బన్: నగరంలోని 7వ డివిజన్ టేకులపల్లి శ్రీ వేంకటేశ్వర గోశాలను శుక్రవారం తెలంగాణలోని వివిధ జిల్లాల గోశాలల ప్రతినిధుల బృందం సందర్శించింది. ఖమ్మం జిల్లా గోశాల ఆధ్వర్యాన తెలంగాణ గోశాల ఫెడరేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు మహేష్ అగర్వాల్ పుట్టినరోజు సందర్భంగా ఈనెల 14వ తేదీ నుంచి 20వ తేదీ వరకు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తుండగా.. మొదటిగా ఖమ్మం గోశాలలో గోపూజలు నిర్వహించినట్లు తెలిపారు. తెలంగాణ గోశాల ఫెడరేషన్ కోశాధికారి శ్రీరామ్, కార్యవర్గ సభ్యులు కిరణ్, స్థానిక గోశాల ప్రతినిధి, ప్రధాన అర్చకుడు ఆరుట్ల శ్రీనివాస్ చార్యులు, వివిధ జిల్లాల గోశాల అధ్యక్షులు గణేష్, యాకు, లకావత్ సుధాకర్‌లతో పాటు భాస్కర్, రమేష్, వెంకన్న, మాంజ అశోక్, సుమన్, దేవేందర్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

జీపీ కార్మికులకు ప్రవాసాంధ్రుడి సంఘీభావం

ఖమ్మంరూరల్: గత తొమ్మిది రోజులుగా జీపీ కార్మికులు చేస్తున్న సమ్మెకు ఓ యువకుడు సామాజిక మాధ్యమాల వేదికగా ఇచ్చిన స్పీచ్ ప్రతీ ఒక్కరిని ఆలోచింపచేస్తోంది. వివరాలు ఇలా ఉన్నాయి. ఖమ్మం రూరల్ మండలంలోని ఏదులాపురం గ్రామానికి చెందిన సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్ తమ్ముడు దండి రంగారావు కుమారుడు వృత్తిరీత్యా విదేశాల్లో ఉంటున్నాడు. తాజాగా కార్మికుల సమ్మెకు రంగారావు వాట్సాప్ వేదికగా సంఘీభావం ప్రకటించారు. తెలంగాణ సమాజం మీ వెంట ఉంటుందని, ఆధైర్యపడొద్దని కార్మికులకు సందేశం ఇచ్చాడు. దీంతో పలు రాజకీయ పార్టీలు, నాయకులు, విశ్లేషకులు స్పీచ్‌ను ప్రశంసించారు.

కొనసాగుతున్న జీపీ వర్కర్ల సమ్మె

గ్రామ పంచాయతీ కార్మికుల సమ్మె శుక్రవారం తొమ్మిదో రోజుకు చేరుకుంది. ఈ మేరకు పలు రాజకీయ పార్టీల నేతలు, ప్రజాసంఘాల నాయకులు సమ్మె శిబిరాలను సందర్శించి తమ సంఘీభావం ప్రకటించారు. గ్రామ ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించి సమ్మె విరమింపచేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

– సాక్షి నెట్‌వర్క్



కూసుమంచి: శిబిరం వద్ద మాట్లాడుతున్న ప్రజాపంథా నాయకులు



నేలకొండపల్లి: కార్మికులకు సంఘీభావం తెలుపుతున్న యూటీఎఫ్ నాయకులు



ఖమ్మంరూరల్: పంచాయతీ కార్మికులకు మద్దతు తెలుపుతున్న వైఎస్సార్‌టీపీ నాయకులు